44

# గుప్పెడు మెతుకులు

అవి అవంతీ దేశాన్ని 'అనంగపాల మహారాజు' జనరంజకంగా పరిపాలిస్తున్న రోజులు.

ఆయనకి ఉన్న లక్షణాలన్నీ లక్షణమైనవే కాని- కాశ్మీర, ఆంధ్ర వంటి అరవై నాలుగు దేశాలనూ జయించి ఏకచ్ఛత్రాధిపత్యం వహించి తాను చక్రవర్తి కావాలనేది ఆయన జీవితాశయం!

పట్టాభిషిక్తుడైన వెంటనే ఆయన చేసిన మొదటి పని- తన సైనిక బలాన్ని పటిష్ఠం చేయడం.., ఆపైన పెంచడం! ఐదు సంవత్సరాలలోనే అనంగపాలుని సైన్యం అనన్యం అన్నంతగా బలపడింది. ఆ వెంటనే ఇరుగు పొరుగు రాజ్యాలను జయించి తన రాజ్యంలో కలుపుకుని ఆయా దేశాధీశులను తనకు సామంతులుగా చేసుకున్నాడు.

ఇప్పుడు ఆయన దృష్టి మహా కోసలం మీద పడింది.

నిజానికి- మహాకోసలం అవంతీ రాజ్యానికి సమీపంలోనే ఉంది. అయినా... అప్పటివరకు దానిని జయించే ప్రయత్నం చేయలేదు. అందుకు కారణం- మహా కోసలాధీశుడైన 'మంగళసేనుడు' కూడా ప్రజారంజకంగా పరిపాలిస్తూ తన రాజ్యాన్ని పటిష్ఠం చేసుకున్నవాడే.

తనకి సమఉజ్జీ అయిన మంగళసేనుడు పొరుగుననే ఉండడాన్ని ఎంతమాత్రం భరించలేక పోయాడు అనంగపాలుడు. అది అతనికి కంటకప్రాయం అనిపించింది. ఎలాగైనా మహాకోసలాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకోవాలన్న పట్టుదల పెరిగింది.

అందుకోసం తన సైన్యాన్ని మరింత పటిష్ఠం చేశాడు. కొంత కాలానికి మంగళసేనుని జయించగలనన్న నమ్మకం కుదిరింది అనంగపాలునికి. అయితే అందుకు దైవబలం కూడా అవసరమనిపించింది. సర్వ సంగ పరిత్యాగులైన మహర్షుల ఆశీస్సులు పొందితే దైవబలం అదంతట అదే సమకూరుతుందన్న నమ్మకం కలిగింది.



అవంతీ రాజ్యానికి సమీపంలో ఒక కీకారణ్యం ఉంది. అందులో 'శివయోగి' అనే మహర్షి తపస్సు చేసుకుంటుంటాడు. ఆయన సర్వసంగపరిత్యాగి అనీ, ఎంతో మహత్తుగలవాడనీ, సాక్షాత్తూ దైవాంశ సంభూతుడనీ, ఆయన వాక్కు వేదవాక్కేనని ప్రజలు అనుకుంటుండేవారు.

'అటువంటి మహాపురుషుని ఆశీస్సులు పొంది యుద్ధయాత్రకు బయలుదేరితే విజయం తథ్యం!' అన్న నమ్మకం కలిగింది అతనికి. ఒక శుభదినాన మంత్రి, దండనాయకులు, ఇతర పరివారం వెంటరాగా... శివయోగి దర్శనానికి కీకారణ్యానికి వెళ్లాడు అనంగపాలుడు.

అడవిలో కొంతదూరం వెళ్లేసరికి– ఒక పెద్ద అందమైన సరస్సు కనిపించింది. సరస్సు ఒడ్డున ప్రక్కప్రక్కనే నిలబడి ఒక పెద్దపులీ, మేకా నీరు త్రాగుతున్నాయి. వీరి అలికిడికి అవి వెనుదిరిగి చూశాయి కానీ, భయపడలేదు.

ఈ సంఘటన చూసి మంత్రి- "ప్రభూ.... మనం శివయోగిగారి ఆశ్రమం సమీపించాం. ఆయన మహిమ వల్ల క్రూర జంతువులు కూడా సాధుజంతువులుగా ప్రవర్తిస్తున్నాయి" అన్నాడు.

తామందరూ ఒకేసారి వెళ్తే యోగిగారికి తపోభంగం కావచ్చునన్న ఉద్దేశంతో కొంతదూరంలోనే గుడారం వేయించి- అందర్నీ అక్కడే ఉండమని చెప్పి, తానొక్కడే యోగి దర్శనార్థం బయలుదేరాడు అనంగపాలుడు.

ఆయన వెళ్లేసరికి శివయోగి ధ్యానంలో ఉన్నారు. ఆయన ధ్యానానికి భంగం కలిగించకూడదన్న ఉద్దేశంతో ఆయనకి కొంచెం దూరంలో వినమ్రభావంతో చేతులు కట్టుకుని నిలబడి ఉండిపోయాడు అనంగపాలుడు.

అంతటి ధ్యాననిష్టలో ఎవరో చెవిలో చెప్పినట్లుగా కళ్ళు తెరిచాడు శివయోగి. ఎదురుగా నిల్చునివున్న అనంగపాలుని ఉద్దేశించి "స్వాగతం మహారాజా..!" అంటూ సాదరంగా అనంగపాలుని ఆహ్వానించాడు శివయోగి.

"స్వామీ... నేను తమ ఆశీస్సులు కోరి వచ్చాను. 'విజయుడవు కమ్ము' అని దీవించండి" అంటూ శివయోగి ముందు మోకరిల్లాడు అనంగపాలుడు.

"మహా కోసలం మీదికి యుద్ధానికేనా అనంగపాలా?" అని మందహాసంతో అడిగాడు శివయోగి.

ఎక్కడో కీకారణ్యంలో ఓ మూలన ముక్కుమూసుకుని తపస్సు చేసుకునే ఈ యోగి తన ఆంతర్యాన్ని గ్రహించడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది అనంగపాలునికి.

"చిత్తం.... స్వామీ.... సర్వజ్ఞులు తమరు!" అన్నాడు వినయంగా.

"అవన్నీ తరువాత.., నీవు ఇప్పుడు నా అతిథివి. ముందు నా ఆతిథ్యం స్వీకరించు!" అన్నాడు శివయోగి.

"మహాప్రసాదం. తమ ఆజ్ఞ ఎలా అయితే అలాగే!" అన్నాడు అనంగపాలుడు.

వెంటనే శిష్యులను పిలిచి మహారాజుకి భోజన ఏర్పాట్లు చేయమన్నాడు శివయోగి.

శివయోగి అనంగపాలుని తన సరసనే కూర్చుండబెట్టుకున్నాడు. శిష్యులు వారిద్దరికి లేత తామర ఆకుల్లో భోజనం వడ్డించారు.

వెదురుబియ్యపు అన్నం, పుట్టతేనెతో కలిపిన ఫలాలు, అడవిలో దొరికే కాయగూరలతో చేసిన కూరలు, పచ్చడులు, పులుసు, కమ్మని చిక్కని ఆవుపాల మజ్జిగ... రాజుగారి రోజువారీ భోజనంతో పోలిస్తే ఏమాత్రం విలువలేని ఆహారం! కానీ, దివాణంలో ఎంతో ఖరీదైన, అపురూపమైన పదార్థాలతో చేసిన ఆహారంలోని ఏ పదార్థానికి కూడా ఈ పదార్థాల రుచి లేదు.

అంతటి స్వాదిష్ట పూర్వకమైన ఆహారాన్ని జన్మలో తినలేదు అనిపించింది- అనంగపాలునికి!

వద్దు వద్దనుకుంటూనే చాలా ఎక్కువగా తినేశాడు.

"ఈ గుప్పెడు అన్నం ఆవుపాల పెరుగుతో కలుపుకుని తిను!" అంటూ శివయోగి స్వయంగా తన గుప్పిటితో అన్నం తీసి రాజుగారి విస్తట్లో వడ్డించాడు.

యోగి మాటలు కాదనలేక ఎక్కువైనా ఆ గుప్పెడు మెతుకులూ అతి కష్టం మీద తిన్నాడు అనంగపాలుడు.

భోజనం అయ్యాక ఇద్దరూ బయటకు వచ్చారు.

అనంగపాలుడు బలవంతం కొద్దీ తిన్నాడేమో... అన్నం ఇమడలేదు. మాటిమాటికీ తిన్న అన్నం పొట్టలో నుంచి పైకి తన్నుకు రాసాగింది. అలా వచ్చినవెంటనే ఆశ్రమ ప్రాంగణందాటి నోట్లోకి వచ్చిన ఆ అన్నాన్ని ఉమ్మివేసి రాసాగాడు.

ఇలా నాలుగైదుసార్లు జరిగాక, శివయోగి- "రాజా... ఏమిటి- ఏదో ఇబ్బంది పడుతున్న ట్లున్నావు?" అని అడిగాడు.

"స్వామీ... అన్నం ఎక్కువయింది. ఇమడడంలేదు. అందులో చివరన మీరు వడ్డించిన పెరుగు అన్నం అసలు ఇమడడంలేదు. మాటిమాటికీ వాంతిగా బయటకు వస్తోంది" అన్నాడు రాజు.

"నేను పెట్టింది ఎంత రాజా? గుప్పెడు మెతుకులేగా..?!" అన్నాడు శివయోగి.

"చిత్తం... ఆ గుప్పెడు మెతుకులే ఇమడడం లేదు" అన్నాడు అనంగపాలుడు పొట్ట తడుముకుంటూ.

"గుప్పెడు మెతుకుల్ని ఇముడ్చుకోలేని వాడివి- మహాకోసలం అంత రాజ్యాన్ని ఎలా ఇముడ్చుకోగలవు రాజా?" అన్నాడు శివయోగి నవ్వుతూ.

అనంగపాలునికి జ్ఞానోదయం అయింది. తన కళ్ళు తెరిపించడానికే శివయోగి ఆ విధంగా చేశాడని గ్రహించాడు.

పశ్చాత్తాపంతో ఆయన పాదాల మీద పడి, "స్వామీ... నా కళ్లు తెరిపించారు. జీవితం అశాశ్వతం అని తెలిసికూడా కీర్తి కోసం ప్రాకులాడి అకృత్యాలు చేశాను. నన్ను క్షమించండి" అంటూ వాపోయాడు.

శివయోగి ఆప్యాయంగా అనంగపాలుని వెన్నుతట్టి లేపాడు.

★★★